మెయిన్

# టీ-మీడియా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 8
సంచిక : 232
పేజీలు : 3

శనివారం
04.04.2026

GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## ఔషధ సంస్థలకు...

# షాకిచ్చిన ట్రంప్

- 100 శాతం సుంకాల విధింపు
- కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం





**టీ మీడియా, ఏప్రిల్ 3, ఢిల్లీ బ్యూరో:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాల విషయంలో మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఔషధ రంగంపై భారీ సుంకాల్ని విధిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికాతో ధరల ఒప్పందాలు కుదుర్చుకోని విదేశీ ఫార్మా సంస్థల పేటెంట్ పొందిన మందులపై 100శాతం వరకు టారిఫ్‌లు విధించాలని ట్రంప్ ఆదేశించారు. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం అంతర్జాతీయ ఫార్మా రంగంలోనూ సంచలనంగా మారింది.

గతేడాది ప్రతీకార సుంకాలను ప్రకటించిన లిబరేషన్ డే రోజే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ధరల ఒప్పందాన్ని అంగీకరించి అమెరికాలో తయారీ కేంద్రాల్ని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సంస్థలకు మాత్రం సుంకాల నుంచి పూర్తి మినహాయింపు లభించనుంది. ఔషధాల దిగుమతులపై ఆధారపడటం జాతీయ భద్రతకు ముప్పు అని భావిస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా ప్రభుత్వంతో 'మోస్ట్ ఫేవరెడ్ నేషన్' ధరల ఒప్పందం కుదుర్చుకున్న సంస్థలతో పాటు అమెరికాలోనే తమ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసే సంస్థలకు ఎటువంటి పన్ను ఉండదు. మరోవైపు, అమెరికాలో ప్లాంట్లను నిర్మిస్తూ, ఇంకా ధరల ఒప్పందం కుదుర్చుకోని కంపెనీలపై 20 శాతం పన్ను విధిస్తారు. అయితే, రాబోయే నాలుగేళ్లలో వీరు ఒప్పందాలు చేసుకోకపోతే, సుంకాలను 100 శాతానికి పెంచనున్నట్లు ట్రంప్ ప్రభుత్వం పేర్కొంది.

### చర్చలు జరిపేందుకు గడువు

ఈ మేరకు అమెరికాతో ఫార్మా కంపెనీలు చర్చలు జరిపేందుకు ట్రంప్ సర్కార్ గడువును నిర్దేశించింది. భారీ ఫార్మా కంపెనీలకు 120 రోజులు, చిన్న తరహా కంపెనీలకు 180 రోజులు గడువును ఇచ్చింది. ఈ గడువు ముగిసిన తర్వాత నిబంధనలు పాటించని కంపెనీలపై 100 శాతం టారిఫ్?లు అమల్లోకి రానున్నాయని ఉత్తర్వుల్లో ట్రంప్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే ఫైజర్, ఎలి లిల్లీ, బ్రిస్టల్ మయర్స్ స్క్విబ్ వంటి దిగ్గజ సంస్థలతో ట్రంప్ ఒప్పందాలను కుదుర్చుకుంది. ఔషధ రంగంపై కొత్తగా సుంకాలు విధించడంపై ఫార్మాస్యూటికల్ రీసెర్చ్ అండ్ మాన్యుఫాక్చరర్స్ ఆఫ్ అమెరికా సీఈఓ స్టీఫెన్ జె. ఉబ్ల్ స్పందించారు. ఈ పన్నులు పరిశోధనలు, పెట్టుబడులను దెబ్బతీస్తాయని చెప్పారు. మందుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులపై భారం పడుతుందని హెచ్చరించారు.

### లోహాలపై విధించే సుంకాల్లో కూడా మార్పులు

ఇదిలా ఉండగా, లోహాలపై సుంకాల్లో కూడా ట్రంప్ మార్పులు చేశారు. స్టీల్, అల్యూమినియం, రాగి ఉత్పత్తులపై ఉన్న 50 శాతం టారిఫ్‌ను ఇకపై కస్టమర్లు చెల్లించే పూర్తి కస్టమ్స్ విలువ ఆధారంగా లెక్కిస్తారు. వాషింగ్ మెషీన్ల వంటి వస్తువుల్లో లోహం వాటా 15 శాతం కంటే ఎక్కువగా ఉంటే, ఆ వస్తువు మొత్తం విలువపై 25 శాతం సుంకం విధిస్తారు. ట్రంప్ సుంకాల వల్ల ప్రపంచ సరఫరా గొలుసు దెబ్బతిని సామాన్యులపై భారం పడుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### పంతం నెగ్గించుకుంటున్న ట్రంప్

సుంకాల విధింపు విషయంలో ట్రంప్ చాలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. గతేడాది ట్రంప్ 'ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్' (1977) ఆధారంగా అన్ని దేశాలపై సుంకాలను బాదారు. ఫిబ్రవరి 20న అమెరికా సుప్రీంకోర్టు ట్రంప్ విధించిన సుంకాలను చట్టవిరుద్ధమైనవిగా పేర్కొంది. ట్రంప్ నిర్ణయాన్ని కొట్టివేసింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన కొన్ని గంటల్లోనే ట్రంప్ మరో చట్టాన్ని ప్రయోగించారు. ఈ కొత్త చట్టం కాలపరిమితి 150 రోజులు ఉంటుంది. ఈ చట్టం ప్రకారం 10 శాతం పన్ను విధించవచ్చు. ఇప్పుడు తాజాగా '1962 ట్రేడ్ ఎక్స్‌పాన్షన్ యాక్ట్‌ లోని 'సెక్షన్ 232'ను ఉపయోగించి ఔషధ, లోహ రంగాలపై పన్నులు విధించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ట్రంప్ ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తన పంతాన్ని నెగ్గించుకుంటున్న పరిస్థితి నెలకొంది.

## గ్రూప్-1పై దాఖలైన పిటిషన్లు కొట్టివేసిన సుప్రీంకోర్టు

- తీర్పును స్వాగతిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి



**టీ మీడియా, ఏప్రిల్ 3, హైదరాబాద్ బ్యూరో:** గ్రూప్-1 ఉద్యోగ నియామకాలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఇది ఉద్యోగ నియామకాల పట్ల రాష్ట్ర ప్రభుత్వ పారదర్శకతకు, చిత్తశుద్ధికి గుర్తింపుగా భావిస్తున్నట్లు సీఎం ఎక్స్?లో పోస్ట్ చేశారు. కొలువుల కోసం ఏళ్ల తరబడి ఎదురు చూసి, కన్నవారి కష్టంపై ఆధారపడలేక, కొలువు వస్తుందో రాదో అన్న దిగులుతో పదేళ్లు కాలం వెళ్లదీసిన గ్రూప్ -1 ఆశావహులకు ఇది పెద్ద ఊరట కలిగించిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. **గ్రూప్-1 అధికారులుగా యువత భాగస్వామ్యం** : ప్రజా ప్రభుత్వం వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి నెలల వ్యవధిలో నియామక పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ నియామకాలను అడ్డుకోవాలనుకున్న దుష్టశక్తుల కుట్రలను, కుతంత్రాలను ఛేదించి, రాష్ట్ర పునర్నిర్మాణంలో తొలి గ్రూప్-1 అధికారులుగా యువతను భాగస్వాములను చేశామన్నారు. గ్రూప్-1 ఉద్యోగాలు పొందిన వారికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆలోచనలు, సంకల్పానికి అనుగుణంగా టీజీపీఎస్సీ వ్యవస్థను ప్రక్షాళన చేసినట్టు సీఎం ప్రస్తావించారు. నిరుద్యోగ యువతకు వ్యవస్థ పట్ల విశ్వాసాన్ని పునరుద్ధరించి, అత్యంత పారదర్శకంగా ఈ నియామకాలను పూర్తి చేసిన టీజీపీఎస్సీ ఛైర్మన్, ఉద్యోగులు, సిబ్బందికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు

### హైకోర్టు తీర్పును స్వాగతించిన సీఎం

గతంలో గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు వెలువరించిన తీర్పును సైతం సీఎం రేవంత్ రెడ్డి స్వాగతించారు. ఆ మేరకు ఆయన సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఎన్ని కుట్రలు పన్నినా న్యాయ పోరాటంలో విజయం సాధించామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన 563 మంది గ్రూప్-1 అభ్యర్థులకు అభినందనలు తెలియజేశారు.

## భారత్‌కు మరింత చమురు సరఫరా

- హామీ ఇచ్చిన రష్యా.



**టీ మీడియా, ఏప్రిల్ 3, ఢిల్లీ బ్యూరో :** పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఇండియా చమురు కొరతను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండియాకు మరింత చమురు సరఫరా చేయాలని రష్యా నిర్ణయించింది. ఆయిల్, లిక్విఫైడ్ నాచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) సరఫరాను పెంచబోతున్నట్లు రష్యా శుక్రవారం ప్రకటించింది. రష్యా మొదటి డిప్యూటీ ఛైర్మన్ డెనిస్ మాంటురోవ్ ప్రస్తుతం ఇండియాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీతో శుక్రవారం భేటీ అయ్యారు. ఈ భేటీ సందర్భంగా చమురు సరఫరాపై హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. భారత అవసరాలకు సరిపడా చమురును అందించే సత్తా రష్యన్ కంపెనీలకు ఉందని, చమురు ఉత్పత్తి పెంచుతామని డెనిస్ అన్నారు. ఈ అంశంపై ఇండియాలోని రష్యన్ ఎంబసీ కీలక ప్రకటన చేసింది. దీని ప్రకారం.. రష్యా గత ఏడాది చివరినాటికి మినరల్ ఫెర్టిలైజర్స్ సరఫరాను 40 శాతం పెంచింది. భవిష్యత్తులో భారత అవసరాలకు అనుగుణంగా మరింత పెంచేందుకు సిద్ధంగా ఉంది. అణుశక్తి అంశంలో రష్యా, ఇండియా తమ భాగస్వామ్యాన్ని పెంచుకుంటున్నాయి. దీనిలో భాగంగానే కుడంకులామ్ న్యూక్లియర్ పవర్ ప్లాంట్ కోసం పవర్ యూనిట్స్ నిర్మిస్తోంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన నిర్మాణ పనులు జరుగుతున్నాయి.ఇరు దేశాలు కలిసి సంయుక్తంగా యూరియా ఉత్పత్తి ప్రాజెక్టును ప్రారంభించబోతున్నాయి. అణుసహకారంలో కూడా ఇరు దేశాలు కలిసి పని చేస్తున్నాయి. పరిశ్రమలు, అంతరిక్షం, విద్య, ఇన్నోవేషన్, వాణిజ్యం, టెక్నాలజీ, ఖనిజాలు వంటి అంశాల్లో కూడా రెండు దేశాలు మరింతగా కలిసి పని చేయాలని నిర్ణయించాయి.

## మూడు రోజులు మోస్తరు వర్షాలు



**టీ మీడియా, ఏప్రిల్ 3, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో మరోసారి తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలంగాణ వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న మూడు రోజుల పాటు గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాలోనూ, రేపు ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ. అలాగే ఎల్లుండి ఇవాళ ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, సంగారెడ్డి, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురుస్తుందని తెలిపింది. అంతేకాకుండా రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# భారత్ పెట్రోలియంలో భారీ మోసం

## రూ.5.72 కోట్ల స్కామ్!




**టీ మీడియా, ఏప్రిల్ 3, షిప్రా :** భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్?)కు సంబంధించిన భారీ మోసం ఒకటి మధ్యప్రదేశ్?లోని ఇండోర్?లో వెలుగులోకి వచ్చింది. కంపెనీ ఫిర్యాదు మేరకు షిప్రా పోలీస్? స్టేషన్? పరిధిలో ఏడుగురు వ్యాపారవేత్తలపై కేసు నమోదు చేశారు. ఆ కేసులో కోట్ల రూపాయల విలువ గల పెట్రోల్, డీజిల్ దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి.

### బీపీసీఎల్ కార్డ్ దుర్వినియోగం

పోలీసుల సమాచారం ప్రకారం, బీపీసీఎల్? సంస్థ తమ వద్ద పనిచేసే వాళ్లకు పెట్రోల్, డీజిల్ కొనుగోలును సులభతరం చేయడానికి ప్రత్యేక కార్డులను జారీ చేసింది. ఈ కార్డు ద్వారా పనివాళ్లు కేవలం కంపెనీ అవసరాల కోసం మాత్రమే ఇంధనం తీసుకోవాలి. అయితే కొంతమంది కార్డును అక్రమంగా ఉపయోగిస్తున్నారు. పెద్ద మొత్తంలో ఇంధనం తీసుకుని, దానికి సంబంధించిన డబ్బును కంపెనీకి చెల్లించకుండా మోసం చేస్తున్నారని విచారణలో తేలింది.

### రూ.5.72 కోట్ల విలువైన ఇంధనం

2023లో సుమారు రూ. 5.72 కోట్ల విలువైన పెట్రోల్, డీజిల్‌ను కొనుగోలు చేయడానికి ఆ కార్డులను వినియోగించారు. దీనికిగాను కంపెనీతో ఎలాంటి చెల్లింపు చేయలేదు. ఇటీవల కంపెనీలో సమగ్ర ఆడిట్ నిర్వహించిన అనంతరం ఈ మొత్తం మోసం బయటపడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

### ఏడుగురిపై కేసు నమోదు

ప్రాథమిక విచారణ జరిపిన తర్వాత ఈ పోలీసులు విశాల్ సింగ్, శశి సింగ్, దల్బీర్ సింగ్, బల్వీందర్ సింగ్, వాహిద్ ఖాన్, నరేంద్ర వాసు, బల్వీర్ సింగ్‌లపై కేసు నమోదు చేశారు. ఇంకొంతమంది పాత్ర ఉన్నట్లు పోలీసులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరుపుతున్నారు. కంపెనీలోని ఉద్యోగులు లేదా బయటివారు ఎవరైనా ఇందులో ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు జరుగుతుంది. అవసరమైతే మరికొందరిపై కేసు నమోదయ్యే అవకాశముందని అధికారులు తెలిపారు.

### అసలేంటా స్కామ్

పెట్రోల్, డీజిల్ కొనుగోలు కోసం కంపెనీ రీఛార్జబుల్ కార్డులను ఉద్యోగులకు జారీ చేస్తుంది. కార్డులో డబ్బులు జమ చేసిన తర్వాతే ఇంధనం పంపిణీ చేస్తారు. అయితే కొంతమంది ఈ కార్డ్? ద్వారా అధికంగా పెట్రోల్?, డీజిల్?నం తీసుకుంటున్నారు. ఈ విషయం సమగ్ర ఆడిట్ అనంతరం బయటపడింది. సుమారు 1,093 మంది కార్డ్? ద్వారా ఇంధనం తీసుకుని, తిరిగి డబ్బును చెల్లించకుండ మోసం చేశారని అనుమానిస్తున్నారు. ఈ మోసాన్ని నడిపించడంలో కంపెనీలోని కొందరు ఉద్యోగులు కూడా నిందితులతో కుమ్మక్కై ఉండవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

### ఎలాంటి టెక్నాలజీ వాడారు

అంతేకాకుండా కార్డ్?లో నిత్యం బ్యాలెన్స్? చూపించేందుకు ఎటువంటి టెక్నాలజీ వాడారనేది తదుపరి విచారణలో తేలాల్సి ఉంది. ఇది కేవలం ఇండోర్?నకు పరిమితమైనది కాదని దేశవ్యాప్తంగా విస్తరించుండచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇలాంటి మోసాలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీపీసీఎల్? సంస్థ కోరుతోంది. ఈ ఘటన వ్యాపార రంగాలపై భారీ ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. విచారణ ముగిసే సమయానికి మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

## మరో అమెరికా...

# ఎఫ్-35ను కూల్చేశాం

- పైలట్ బతకడం కష్టమే: ఇరాన్



**టీ మీడియా, ఏప్రిల్ 3, ఢిల్లీ బ్యూరో :** అమెరికాకు చెందిన మరొక ఐదోతరం ఎఫ్-35 యుద్ధ విమానాన్ని కూల్చేశామని ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. సెంట్రల్ ఇరాన్ గగనతలం మీదుగా వెళ్తున్న ఎఫ్-35 ఫైటర్ జెట్‌ను ఒక అధునాతన గగనతల రక్షణ వ్యవస్థతో కూల్చినట్లు వెల్లడించింది. తమ ఇంటర్‌సెప్టర్ మిస్సైల్ తాకగానే అమెరికా యుద్ధ విమానం ఎఫ్-35 భారీ పేలుడుతో కూలిపోయే స్థితికి చేరిందని, అందులోని పైలట్ బతికి బయటపడటం కష్టమేనని ఇరాన్ సైన్యం ప్రధాన కార్యాలయం ఖతం అల్ అంబియా అధికార ప్రతినిధి తెలిపారు. ఐఆర్‌జీసీ ఏరోస్పేస్ దళానికి చెందిన సరికొత్త గగనతల రక్షణ వ్యవస్థ ఈ ఎటాక్ చేసిందన్నారు. ఈమేరకు వివరాలతో ఇరాన్ ప్రభుత్వ టీవీ ఛానల్ శుక్రవారం రోజు ఓ వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. అంతకుముందు, మార్చి 19న ఇరాన్ దాడిలో ఒక ఎఫ్-35 యుద్ధ విమానం దెబ్బతిన్నట్లు కథనాలు వచ్చాయి.

### ఇంగ్లండ్ నుంచి వచ్చిన అమెరికా ఎఫ్-35

ఇక అదనపు వివరాలతో ఇరాన్ ప్రభుత్వానికి చెందిన మీడియా సంస్థ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ బ్రాడ్‌కాస్టింగ్ టీవీ, రేడియోలలో ఓ వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. దీని ప్రకారం, ఇంగ్లండ్‌లోని అమెరికా వైమానిక స్థావరం ఆర్ఏఎఫ్ లాకెన్ హీత్ నుంచి సెంట్రల్ ఇరాన్‌లోని ప్రాంతాలపై దాడి చేసేందుకు ఒక ఎఫ్-35 యుద్ధ విమానం వచ్చింది. అధునాతన స్టెల్త్ టెక్నాలజీ కలిగిన ఆ యుద్ధ విమానాన్ని సరికొత్త గగనతల రక్షణ వ్యవస్థతో ఐఆర్‌జీసీ కూల్చేసింది. గురువారం తెల్లవారుజామున 2.50 గంటలకు ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థ దాడి చేసిన వెంటనే ఆ విమానాన్ని మంటలు అలుముకున్నాయి. ఈ వివరాలతో తమ అధికారిక న్యూస్ వెబ్‌సైట్‌లోనూ ఒక ప్రకటనను ఐఆర్‌జీసీ విడుదల చేసింది.

### మార్చి 19న ఎఫ్-35 ఎమర్జెన్సీ ల్యాండింగ్

మార్చి 19న ఇరాన్ చేసిన దాడి విషయానికొస్తే, ఆ రోజున ఒక ఎఫ్-35 ఫైటర్ జెట్ అత్యవసరంగా గల్ఫ్‌లోని ఒక సైనిక స్థావరంలో ల్యాండ్ అయిందని సాక్షాత్తూ అమెరికా మీడియాలో కథనాలు వచ్చాయి. పైలట్ సురక్షితంగానే ఉన్నాడని, విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్‌పై దర్యాప్తు చేస్తున్నామని అప్పట్లో అమెరికా సైనిక అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు 125కుపైగా అమెరికా, ఇజ్రాయెల్ డ్రోన్లను కూల్చేశామని ఐఆర్‌జీసీ గతంలోనే ప్రకటించింది. దీన్నిబట్టి ఇరాన్ గగనతల రక్షణ వ్యవస్థల్లో కొత్త అప్‌గ్రేడ్స్ జరిగినట్లు తెలుస్తోంది.

## సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో....

# ఏసీబీ సోదాలు

- రూ.42 లక్షల ఫోన్‌పే లావాదేవీలు

**టీ మీడియా, ఏప్రిల్ 3, వరంగల్ :**లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు, దస్తావేజులు ఇస్తారు. లేదంటే తమ వద్దే పెట్టుకుని ముప్పుతిప్పలు పెడతారు. ఈ ప్రక్రియలో ప్రైవేటు వ్యక్తులతో కలిసి అధికారులు లంచాలకు అలవాటు పడ్డారు. దీంతో విసిగిపోయిన వారు కొంతమంది ఏసీబీని ఆశ్రయించారు. 3లో..

## డిసిసి నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం

2లో..

## అక్రిడిటేషన్స్ గందరగోళానికి తెరదించండి

2లో..




# డిసిసి నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం

- మంత్రి వివేక్ వెంకటస్వామి

**టీ మీడియా, ఏప్రిల్ 03, రామకృష్ణాపూర్:**

క్యాతనపల్లి ఎంఎన్ఆర్ గార్డెన్ లో మంచిర్యాల జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యతిథులుగా టిపిసిసి మహేష్ కుమార్ గౌడ్, కార్మిక మైనింగ్ ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా ఇంచార్జ్. మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలి. కాంగ్రెస్ పార్టీలో సీనియార్టీ ప్రతిపాదికనే పదవులు ఇవ్వడం జరుగుతుంది కావున పార్టీ కోసం పని చేసే వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది. బిఆర్ఎస్ పార్టీ పది ఏండ్లు చేసిన అరాచకాలు కాంగ్రెస్ పార్టీ ఎత్తి చూపింది, అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రతి పక్షాలు చేస్తున్న ఆరోపణల ను తిప్పి కొట్టాలన్నారు. గత పది ఏండ్ల బిఆర్ఎస్ పాలన లో రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది. కాళేశ్వరం ప్రాజెక్ట్, మిషన్ భగీరథ పథకాల్లో భారీ స్కాం జరిగిందని చెప్పారు.

ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా కూడా ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో భాగంగా సంక్షమ పథకాలను అమలు చేస్తూ, గత ప్రభుత్వం లో చేసిన అప్పులకు వడ్డీలు కడుతున్నాం అని అన్నారు.

బిఆర్ఎస్ నిర్బంధ పాలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారు. అక్రమ కేసులు అనుభవించారు. దేశం లో కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర ఉంది. 65 ఏండ్ల కాంగ్రెస్, టీడీపీ పాలన లో చేయలేని అప్పులు బిఆర్ఎస్ ప్రభుత్వం చేసింది. బీజేపీ ప్రభుత్వం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని మోసం చేసింది. బీద ప్రజల సంక్షమం కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుంది. కుల మతాలను రెచ్చగొట్టే బిజెపి పార్టీకి తెలంగాణ లో అవకాశం లేదు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వాన్ని రిపేర్ చేస్తున్నాం సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలతో విదేశీ పెట్టుబడులు వస్తున్నాయి, త్వరలో ప్రభుత్వాన్ని గాడిలో పెడతాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సవద్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఎమ్మెల్సీ దండే విఠల్ , మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి తోపాటు నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణస్వీకారం చేపించిన మహేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్స్ గందరగోళానికి తెరదించండి

- అధికారిక ప్రకటనలకే విలువ ఇవ్వండి
- టీడీఎమ్ఎస్ కన్వీనింగ్ కమిటీ

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసే జర్నలిస్టుల అక్రిడిటేషన్స్ విషయంలో అనేక రకాల పుకార్లు వ్యాపిస్తున్నాయని, వాటిని నమ్మాల్సిన అవసరం లేదని తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ (టీడీఎమ్ఎస్) ఫౌండర్ శనగపాటి మురళీకృష్ణ తెలిపారు. అధిపత్య పోరులో భాగంగా ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలు జరుగుతున్నాయని ఆయన అన్నారు. సమాచార శాఖ కమిషనర్ సంతకం చేసిన అధికారిక లెటర్‌హెడ్‌పై వచ్చే ప్రకటనలు, అలాగే సమాచార శాఖ రాష్ట్ర-జిల్లా గ్రూపులు మరియు ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదలయ్యే సమాచారాన్నే పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

**అనుమానాలు-అసత్య ప్రచారాలు**

మంత్రి పొంగులేటి కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారని, అలాంటప్పుడు ఏప్రిల్ 6ను చివరి తేదీగా ఎలా ప్రకటిస్తారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇటీవల రాష్ట్ర కమిటీ సమావేశం జరిగి కొంతమంది అర్హులకు మంజూరు ఇచ్చినట్లు చెబుతున్నా, ఎవరికీ మంజూరు ఇచ్చారో జాబితా బయటకు విడుదల కాలేదు.

కనీసం ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు ఎన్ని కార్డులు, ఫ్రీలాన్సర్లకు ఎన్ని అన్న విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉందని, అయితే అలాంటి వివరాలు వెలువడలేదని పేర్కొన్నారు. ఆ సమావేశంలో డిజిటల్ మీడియా అంశంపై చర్చ జరిగిందా లేదా అన్న విషయమూ స్పష్టత లేనిదని, ప్రచారంలో ఉన్న పోస్టుల్లో కూడా దీనిపై ప్రస్తావన లేదని తెలిపారు. కమిటీ సభ్యుల నుంచి స్పందన కూడా రాకపోవడం అనుమానాలకు దారితీస్తోందన్నారు.

**మరో అవాస్తవ ప్రచారం**

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన తర్వాత హార్డ్ కాపీలు సమాచార శాఖ కార్యాలయంలో సమర్పించాలనే ప్రచారం జరుగుతోందని, ఇది సరైనది కాదన్నారు. డిజిటల్ మీడియా కార్యాలయాలు కొన్ని జిల్లాల్లో ఉన్నాయని, అవి ఐటీ ఎథిక్స్ కోడ్ 2021 మరియుపిఆర్ జీ ఐ (పీఆర్‌జీఐ)చట్టం ప్రకారం తప్పనిసరిగా రాష్ట్ర రాజధానిలోనే ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.

డిజిటల్ మీడియాకు ఇచ్చే కార్డు రాష్ట్ర స్థాయి కార్డు అని, ఎంపిక రాష్ట్ర కమిటీ ద్వారా జరుగుతుందని తెలిపారు. హార్డ్ కాపీలు హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఇవ్వాల్సి ఉంటే ఆన్‌లైన్ సేవల అవసరం ఏమిటని ప్రశ్నించారు.

ప్రతినిధిత్వంపై విమర్శలు ఎథిక్స్ కోడ్ 2021 నిబంధనలకు విరుద్ధంగా ప్రింట్ ఎడిషన్ నిర్వహిస్తున్న కొన్ని మీడియా సంస్థలకు రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం ఉండగా, డిజిటల్ మీడియాకు మాత్రం ప్రాతినిధ్యం లేకపోవడం బాధాకరమన్నారు. అసలు సమస్యలను పక్కనబెట్టి గందరగోళ పోస్టులు చేయడం సరైంది కాదని వ్యాఖ్యానించారు.

**కోర్టులో కేసులు**

ఇంకోవైపు కార్డుల జారీ నిబంధనలపై కోర్టులో కేసులు నడుస్తున్నాయని తెలిపారు. డిజిటల్ మీడియాకు సంబంధించి కాగ్ (CAG )సర్టిఫికెట్‌ను కీలకంగా మార్చారని, దేశవ్యాప్తంగా కేవలం 10 సాఫ్ట్‌వేర్ కంపెనీలకే కేంద్రం ఈ అధికారం ఇచ్చిందని చెప్పారు. అందులో తెలుగు రాష్ట్రాలకు కలిపి రెండు సంస్థలు మాత్రమే ఉండి, అవి కూడా హైదరాబాద్‌లోనే ఉన్నాయని వివరించారు.

ఈ విషయంపై అవగాహన కల్పించే బదులు, అసత్య ప్రచారాలు చేయడం మరియు మంత్రి పొంగులేటి అసెంబ్లీలో చేసిన ప్రకటనలకు విరుద్ధంగా పోస్టులు రావడం బాధాకరమన్నారు. అలాంటి పోస్టులను ఫార్వార్డ్ చేసే వారిపై అవసరమైతే ఐటీ ఎథిక్స్ కోడ్ 2021 ప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు ఇవ్వాలని తెలుగు డిజిటల్ మీడియా ఫెడరేషన్ పిలుపునిచ్చిందని కన్వీనర్ శనగపాటి మురళీకృష్ణ తెలిపారు.

# నివాళులు అర్పించిన బీసీ సంఘాల నేతలు

- అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్

**టీ మీడియా, ఏప్రిల్ 3, వనపర్తి బ్యూరో :**



బహుజన వీరుడు దొడ్డి కొమురయ్య జయంతి, మహాజన వీరుడు శివాజీ మహారాజ్ వర్ధంతినీ లక్డికాపూల్ మీడియా సెంటర్లో జరిపి ఘనంగా నివాళులు అర్పించిన బీ.సీ సంఘాల రాష్ట్ర నేతలు అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షులు సతీష్ యాదవ్. 1946 లో పెత్తందార్ల పై పోరాడి ఆసువులు బాసిన దొడ్డి కొమురయ్య జయంతిని మొగల్ సామ్రాజ్యంపై సింహ గర్జన చేసి బహుజన సమాజం కోసం పోరాడిన చత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతినీ కూడాశుక్రవారం లక్డికాపూల్ లోని మీడియా సెంటర్లో ఆల్ ఇండియా బీఎస్పీ అధ్యక్షుడు మాజీ డిజిపి పూర్ణచంద్రావు, పూలే సంగ్ అధినేత సంగం సూర్యారావు, అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డా" సతీష్ యాదవ్ తదితరుల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. వక్తలు మాట్లాడుతూ మహనీయులలో ఒకరు కురువ జాతి, మరొకరు యాదవ జాతి బిడ్డలైన ఈ వీరులు బహుజన బిడ్డల కోసం దేశం కోసం, రాష్ట్రం కోసం బహుజనుల కోసం ఆ నాడు పోరాటం చేశారని, వారి బాటలో నడిచి మనం పోరాటం చేయాలని, ఈనాడు అదే పెత్తందారులు రాజ్యమేలుతున్నారని వారి పైన పోరాడిన చేయవలసిన అవసరం ఉందని బహుజన సమాజానికి సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు కిషోర్ కుమార్, రాజేష్ కుమార్, బాలస్వామి, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లోని పలు పబ్బుల్లో ఈగల్ టీం తనిఖీలు

- ఐఏఎస్ అధికారి కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్

**టీ మీడియా, ఏప్రిల్ 3, హైదరాబాద్ బ్యూరో :**




మాదకద్రవ్యాల కట్టడి లక్ష్యంగా తెలంగాణ ఈగల్ టీం పోలీసులు హైదరాబాద్‌లో నిఘాను మరింత ముమ్మరం చేశారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు పబ్‌లపై పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. కొండాపూర్?లోని అరెనా పబ్‌లో పలువురికి అత్యాధునిక డ్రగ్ టెస్టింగ్ కిట్‌ల ద్వారా మొత్తం 64 మంది అనుమానితులకు పరీక్షలు నిర్వహించగా 8 మందికి పాజిటివ్ అని తేలింది. పబ్‌లో భారీ ఎత్తున డ్రగ్స్ వినియోగం జరుగుతోందన్న పక్కా సమాచారంతో పోలీసులు ఈ దాడులు నిర్వహించారు. కేవలం స్థానిక పోలీసులే కాకుండా, ఈగల్ ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించారు.

**డ్రగ్స్ వినియోగిస్తే చర్యలు తప్పవు**

నిందితులపై ఎన్డీపీఎస్ చట్టం కింద పలు కేసులు నమోదు చేసి గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. యువకులు పబ్‌కు వచ్చేముందే మాదకద్రవ్యాలు సేవించారా? డ్రగ్స్ వీరికి ఎలా లభిస్తున్నాయి? అనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు. యువకులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు పబ్ కల్చర్ పేరుతో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. హైదరాబాద్‌లోని అన్ని ప్రధాన పబ్‌లపై నిరంతరం నిఘా ఉంటుందని పోలీసులు తెలిపారు.

**ఐఏఎస్ అధికారిణి కుమరుడు**

గంజాయి, బెంజోడియాజెపిన్, మెథాంఫెటమైన్ వంటి ప్రమాదకర మత్తుపదార్థాలను వినియోగించినట్లు పరీక్షల్లో తేలిందని ఈగల్ పోలీసులు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. డ్రగ్ టెస్ట్? చేయగా పాజిటివ్ అని తేలిన వారిలో ఆంధ్రప్రదేశ్? రాష్ట్రానికి చెందిన ఓ మహిళా ఐఏఎస్ అధికారిణి కుమారుడు ఉన్నట్లు తెలుస్తోంది.

# ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య


**టీ మీడియా, ఏప్రిల్ 3, వనపర్తి బ్యూరో :**



నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ కొనియాడారు. శుక్రవారం ఐ డి ఓ సి ఆవరణలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీసీ సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకునేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన యోధుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాన్ని, ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సాయుధ పోరులో తొలి అమరుడైన కొమురయ్య ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ సిబ్బంది, ప్రజా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప మండల హిందూ సమ్మేళనం ఏర్పాట్లు

**టీ మీడియా ఏప్రిల్ 3, పెబ్బేరు:**



శుక్రవారం పెబ్బేరు పట్టణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 100 వ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా పెబ్బేరు ఉప మండలంలో హిందూ సమ్మేళనం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు ఇందులో భాగంగా పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగిన సమావేశంలో హిందూ సమ్మేళన కమిటీని ఎన్నుకున్నారు. హిందూ సమ్మేళన కమిటీ అధ్యక్షుడిగా దేవరశెట్టి మహేష్‌ను ఎన్నుకోగా ఉపాధ్యక్షులుగా టి రాఘవేంద్ర రెడ్డి మంగరాయిమన్యం రవి కుమార్ రెడ్డి ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా హనుమంతు రెడ్డి సహాయ కార్యదర్శులుగా భీమిశెట్టి శ్రీనివాసులు అస్కాని ఆనంద్ మేకల ఎల్లయ్య టీవీఎస్ బుజ్జి వేణు ఆర్ఫ్ మేదరి రంగస్వామి నియమితులయ్యారు కోశాధికారిగా గుర్రంగడ్డ శ్రీనివాస్ రెడ్డిప్రచార కార్యదర్శులుగా గొడుగు బాలవర్ధన్ తోకల మహేష్ మోతె రాఘవేంద్రలను ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షులుగా టి రామచంద్రా రెడ్డి గౌని హేమా రెడ్డి బసాల వెంకటేశ్వర్ రెడ్డి నాగిరెడ్డి పురుషోత్తం గోవర్ధన చారి గోపి పూజారి నవీన్ పూజారి బాధ్యతలు చేపట్టారుఈ నెల 16వ తేదీ గురువారం సాయంత్రం 4 గంటలకు వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం సంత మార్కెట్‌లో హిందూ సమ్మేళనం నిర్వహించనున్నారు ఈ కార్యక్రమానికి స్వామి కమలానంద భారతి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు హిందూ బంధువులు ఆలయ కమిటీ సభ్యులు భజన బృందాలు అయ్యప్ప స్వాములు శివ స్వాములు ఇతర హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు కుటుంబ సమేతంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# 64 ఏళ్ల న్యాయ విద్యార్థికి వాకర్స్ సంఘం సన్మానం

- డాక్టర్ అతీఖ్ అహమద్ కృషికి అభినందనల వెల్లువ

**టీ మీడియా, ఏప్రిల్ 3, వనపర్తి బ్యూరో :**



హైదరాబాద్ శివరాంపల్లిలో హృదయా లను తాకిన ఒక స్ఫూర్తి దాయక ఘట్టం చోటు చేసుకుంది. 64 ఏళ్ల వయసులో కూడా విద్యపై ఆసక్తిని కోల్పోకుండా న్యాయ శాస్త్ర విద్య ను, కాలేజి వెళ్లి , చదువుతున్న డాక్టర్ అతీఖ్ అహమద్ ని సీనియర్ సిటిజన్స్ వాకర్స్ సంఘం ఘనంగా సత్కరించి, సన్మానించింది. 35 సంవత్సరాల పాటు ఉపాధ్యాయ వృత్తిలో వేలాది మంది విద్యార్థుల జీవితాలను మలిచి ఆదర్శ గురువుగా, రిటైర్డ్ హెడ్‌మాస్టర్‌గా ఖ్యాతి గడించిన ఆయన సేవలు ఇప్పటికే సమాజంలో చిరస్థాయిగా నిలిచాయి. గురువుగా తన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసిన తర్వాత కూడా చదువు అనేది ఎప్పటికీ ఆగదు. విద్యాభ్యాసం, నిరంతర ప్రక్రియ అనే నమ్మకంతో ఇప్పుడు లా విద్యను అభ్యసించడం అందరికీ ఆదర్శంగా నిలిచింది.

ఇటీవల జరిగిన సెమిస్టర్ పరీక్షలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ సంఘం సభ్యులు పూలమాలతో, శాలువాతో ఆయనను సత్కరించి అభినందనల జల్లులు కురిపించారు. ఒకప్పుడు వేలాది మంది పిల్లలకు అక్షరజ్ఞానం నేర్పిన గురువు వారి భవిష్యత్తును వెలుగులోకి తీసుకువచ్చిన మార్గదర్శి ఇప్పుడు అదే గురువు, మళ్లీ విద్యార్థి పాత్రలోకి మారడం-ఇది కేవలం వార్త కాదు ఇది ఒక జీవంతమైన స్ఫూర్తి! పూలమాల వేసిన ప్రతి చేతిలో గౌరవం కనిపించింది. శాలువా కప్పిన ప్రతి క్షణంలో ప్రేమ నిండింది. అభినందించిన ప్రతి మాటలో కృతజ్ఞత వెల్లివిరిసింది. వయసు కేవలం సంఖ్య మాత్రమే నేర్చుకోవాలనే తపన ఉంటే ఎప్పుడైనా కొత్త ప్రయాణం మొదలవుతుంది. నన్ను ప్రేమపూరిత - ఆప్యాయత తో సన్మానంచిన వారికి హృదయపూర్వక ధన్యవాదాలు అని అతీఖ్ చెప్పిన మాటలు అక్కడున్న వారందరినీ భావోద్వేగానికి గురిచేశాయి. డాక్టర్ అతీఖ్ అహమద్ జీవితం ఒక గొప్ప సందేశం ఇస్తోంది- జ్ఞానం కోసం చేసే ప్రయాణానికి ఎప్పుడూ ముగింపు ఉండదు. ఈ ఘన సన్మానం కేవలం ఒక వ్యక్తిని గౌరవించడం మాత్రమే కాదు. విద్యకు, కృషికి, నిరంతర అభ్యాసానికి ఇచ్చిన గౌరవం. ఒకప్పుడు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దిన గురువు, ఇప్పుడు అదే గురువు మళ్లీ విద్యార్థిగా మారడం-ఇది కేవలం సంఘటన కాదు ఇది ఒక స్ఫూర్తి గాథ! ఈ కథలో అసలు మలుపు ఇక్కడే చిన్నప్పుడు తన శిష్యుడైన తెలంగాణ



హైకోర్టు సీనియర్ అడ్వకేట్ సత్తూరు రాఘవేందర్ గౌడ్ పరపతి, పేరు ప్రతిష్టలు చూసి-నా శిష్యుడు ఇంత గొప్ప స్థాయికి ఎదిగాడు నేను కూడా , లాయర్ కావాలని, న్యాయం కోసం పనిచేయాలి అనే ఆలోచన ఆయనలో మేల్కొంది. శిష్యుడే... గురువుకు స్ఫూర్తిగా మారాడు! బాధితులకు న్యాయం చేయాలనిసమాజానికి మరింత సేవ చేయాలని ఆ మహత్తర లక్ష్యంతో డాక్టర్ అతీఖ్ అహమద్ న్యాయ విద్యలో చేరి, తన గమ్యస్థానం వైపు ధైర్యంగా అడుగులు వేస్తున్నారు. ఈ అడుగులు అతీఖ్‌ని విజయ తీరానికి చేర్చాలని సంఘ సభ్యులు అభిలషించారు.

# గ్యాస్ సిలిండర్లను ఎత్తుకుపోయారు

- పోలీస్‌స్టేషన్ మెట్లెక్కిన బాధితుడు

**టీ మీడియా, ఏప్రిల్ 3, సిద్దిపేట :**



పశ్చిమాసియా యుద్ధం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా గ్యాస్? కష్టాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. గ్యాస్? కొరత వల్ల పలు చోట్ల ఖాళీ సిలిండర్లతో వినియోగదారులు క్యూలు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో అయితే సిలిండర్? బుక్? చేసిన మూడు, నాలుగు రోజులకు ఇంటికి వచ్చేది. కానీ ఇప్పుడు డెలివరీ కావడానికే 10 నుంచి 14 రోజుల సమయం పడుతుండటంతో వినియోగదారులు ఏజెన్సీల వద్దకు పరుగులు తీస్తున్నారు.

**గ్యాస్ సిలిండర్ల దొంగతనాలు**

మరోవైపు గ్యాస్?కు డిమాండ్? పెరగడం వల్ల బ్లాక్? మార్కెట్? దందాలు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కొందరు డీలర్?లు, పలువురు డెలివరీ బాయ్?లు, మధ్యవర్తుల ద్వారా సిలిండర్లు బ్లాక్? మార్కెట్లోకి చేరుతున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు కొన్నిచోట్ల సిలిండర్? దొంగతనాలూ మొదలయ్యాయి. తాజాగా సిద్దిపేట జిల్లాలో ఇలాంటి ఘటనే జరిగింది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.

**రెండు సిలిండర్లు చోరీ**

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్? పట్టణంలో ఓ ఇంటి ఆవరణలో ఉన్న రెండు డొమెస్టిక్? గ్యాస్? సిలిండర్లను గుర్తు తెలియని దుండగలు అర్ధరాత్రి సమయంలో వచ్చి ఎత్తుకెళ్లారు. గత 25 ఏళ్లుగా ఇంటి ఆవరణలో గ్యాస్? సిలిండర్లు పెట్టి, కిచెన్?లోని స్టవ్?కు పైప్?తో కనెక్షన్ ఇచ్చి ఉపయోగిస్తున్నట్లు ఆ ఇంటి యజమాని వేణుగోపాల్? రెడ్డి తెలిపారు. ప్రస్తుతం ఉన్న గ్యాస్? కొరత కారణంగానే తన ఇంటి ఆవరణలో ఉన్న రెండు సిలిండర్లను ఎత్తుకెళ్లినట్లు అనుమానం వ్యక్తం చేశారు. స్థానిక పోలీస్?స్టేషన్?కు వెళ్లి ఈ మేరకు ఫిర్యాదు చేశారు.

**బారులు తీరిన వినియోగదారులు**

గ్యాస్? కొరత ప్రజలను తీవ్రంగా వేధిస్తుంది. ఓ వైపు సిలిండర్ల దొంగతనాలు, మరోవైపు పలుచోట్ల పక్కదారి పడుతుండటంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో వంట గ్యాస్ సిలిండర్ల కొరతతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. వంట గ్యాస్ సిలిండర్ కార్యాలయాల వద్ద ఉదయం నుంచి ఖాళీ సిలిండర్లతో బారులు తీరుతున్నారు. యూరియా కోసం పాస్ పుస్తకాలు లైన్?లో పెట్టినట్టు సిలిండర్ల కోసం ఖాళీ సిలిండర్లను లైన్లో పెట్టి వేచి చూస్తున్నారు.

**క్యూలో నిలబడినా లాభం లేదు**

గత నెలలో సిలిండర్ కోసం ఆన్?లైన్?లో బుక్ చేసినా ఇప్పటికీ సిలిండర్ రాలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తే, తమ పేరుతో బుక్ చేసుకున్న సిలిండర్ ఇతరులకు అమ్ముకుంటున్నారని మరికొందరు ఆరోపిస్తున్నారు. గత 15 రోజుల నుంచి వంట గ్యాస్ ఆఫీస్ చుట్టూ సిలిండర్ కోసం తిరుగుతూనే ఉన్నామని బాధితులు వాపోయారు. గంటల తరబడి సిలిండర్ కోసం క్యూ లైన్?లో నిలబడినా వంటగ్యాస్ దొరకడం లేదని, ప్రభుత్వం పట్టించుకుని అక్రమ సిలిండర్లపై చర్యలు తీసుకొని గృహ వినియోగానికి ఇబ్బందులు లేకుండా చూడాలని బాధితులు వేడుకుంటున్నారు.

# లైంగిక ఆరోపణలు చేసిన మహిళపై దాడి

- ఎమ్మెల్యే శ్రీధర్ సమక్షంలోనే ఘటన

**టీ మీడియా, ఏప్రిల్ 3,రైల్వే కోడూరు :**



అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరులో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్?పై లైంగిక ఆరోపణలు చేసిన మహిళపై జనసేన నాయకులు దాడి చేశారు. పోలీసులు చేతిలోని లాఠీ లాక్కొని కొట్టడంతో పాటు వెంటపడి తరుముతూ అరాచకం సృష్టించారు. ఈ ఘటన గురువారం రాత్రి రైల్వేకోడూరులో కలకలం రేపింది.

**పోలీసుల కథనం మేరకు**

అమరావతి రాజధాని చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్?లో ఆమోదం తెలిపిన సందర్భంలో సంబరాల కోసం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, మరికొంతమంది పట్టణంలోని ప్రధాన రహదారిపైకి వచ్చారు. అదే సందర్భంగా ఎమ్మెల్యేపై ఆరోపణలు చేసిన ఓ ఉద్యోగిని, ఆమె న్యాయవాది ఆజాద్ సాయికృష్ణ సోదరుడు గోపితో కలిసి టోల్?గేట్ వద్ద ఉన్న పూల దుకాణాల వద్దకు వచ్చారు. ఇంతలోనే ఎమ్మెల్యే కారు, కార్యకర్తలు అటుగా వచ్చారు. ఆమెను అక్కడ చూసిన జనసేన నాయకులు తీవ్ర ఆగ్రహంతో వెంట పడ్డారు. స్థానికులు చూస్తుండగా, పోలీసులు అడ్డుకుంటున్నా లెక్క చేయకుండా దాడి చేశారు. గోపిని కొడుతూ ఊరు వదిలి వెళ్లిపోవాలంటూ రోడ్డు పైన వెంటపడి మరీ పరిగెత్తించారు. ఎందుకు దాడి చేస్తున్నారంటూ ఆమె ప్రశ్నిస్తున్నా, సమాధానం చెప్పకుండా తాతంశెట్టి నాగేంద్ర పోలీసులు చేతిలోని లాఠీ తీసుకుని ఆమెపై దాడి చేశారు. ఈ ఘటనను చిత్రీకరిస్తున్న ఓ విలేకరిని సైతం కొట్టి వీడియో ఫుటేజ్?ను డిలీట్ చేశారు. ఈ ఘటన జరుతున్నంతుసేపు కూడా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అక్కడే ఉన్నారు.

**బాధితురాలి వినతి**

జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్?పై తగిన చర్యలు చేపట్టి, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకుండా కట్టడి చేయాలని ఆయన పై లైంగిక ఆరోపణలు చేసిన ఉద్యోగిని కోరారు. మండల పరిధిలోని రాఘవరాజపురం వద్ద ఉన్న టీడీపీ కార్యాలయంలో కూడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి గురువారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన ఉద్యోగిని ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలంటూ రూపానందరెడ్డికి వినతి పత్రం అందజేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్లీన్ చిట్ ఇచ్చిన తర్వాతే తాను ప్రజల మధ్యకు వస్తానని చెప్పిన ఎమ్మెల్యే, ఇప్పుడు అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, ఇది అధినేతను అవమానించినట్లే అని పేర్కొన్నారు. త్రిసభ్య కమిటీ, పార్టీ ఎలాంటి నిర్ణయం తీసుకోనప్పుడు ఎమ్మెల్యే అధికారిక కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటున్నారని బాధితురాలు ప్రశ్నించింది. ఈ విషయం పై ప్రభుత్వ పెద్దలతో చర్చించి చర్యలు చేపడతామంటూ రూపానందరెడ్డి చెప్పారు.

**కేసు నమోదు**

రైల్వేకోడూరు జనసేన నాయకుడు తాతంశెట్టి నాగేంద్రపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైటంది. స్థానిక ఎమ్మెల్యే అరవ శ్రీధర్ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కేసు నమోదైనట్లు సమాచారం. శ్రీధర్ బాధితురాలిపై నిన్న జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర లాఠీతో దాడి చేశారు. పోలీసులు చూస్తుండగానే నడిరోడ్డుపై అమానుషంగా కర్రలతో మహిళపై దాడి చేశారు. దాంతో న్యాయవాదితో కలిసి రైల్వేకోడూరు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేసింది. అయితే నాగేంద్రతోపాటు మరికొందరిపై ఎస్సీ, ఎస్టీ కేసులను పోలీసులు నమోదు చేశారు.

# విద్యార్థినులకు బంపర్ ఆఫర్

- ఉచితంగా ఎలక్ట్రిక్ సైకిళ్లు, స్కూటీలు

**టీ మీడియా,ఏప్రిల్ 3, టేక్మాల్ ప్రతినిధి:**




మెదక్ జిల్లా టేక్మాల్ మండలం దాదాయిపల్లి గ్రామ సర్పంచ్ ఒక చారిత్రాత్మక నిర్ణయంతో . గ్రామ చరిత్రలోనే ముందెన్నడూ లేని విధంగా, బాలికా విద్యను ప్రోత్సహించేందుకు వినూత్న పథకాన్ని ప్రకటించారు. గ్రామంలోని విద్యార్థినులకు రాబోయే విద్యా సంవత్సరం నుండి ఉచితంగా ఎలక్ట్రిక్ వాహనాలను పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

చదువుకు అడ్డుకాకూడదనే సంకల్పంతో గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు సరిగ్గా లేకపోవడం, పాఠశాలలు ,ళాశాలలు దూరంగా ఉండటం వల్ల చాలా మంది బాలికలు మధ్యలోనే చదువు ఆపేస్తున్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సర్పంచ్ ఈ నిర్ణయం తీసుకున్నారు. పాఠశాల విద్యార్థినులకు: 8వ, 9వ, 10వ తరగతి మరియు ఇంటర్ చదువుతున్న ప్రతి విద్యార్థినికి ఉచిత ఎలక్ట్రిక్ సైకిళ్లు అందజేయబడతాయి. ఉన్నత విద్య అభ్యసించే వారికి: డిగ్రీ మరియు బీటెక్ చేస్తున్న యువతులకు కళాశాలలకు వెళ్లేందుకు సులభంగా ఉండేలా ఎలక్ట్రిక్ స్కూటీలు అందించనున్నారు. సర్పంచ్ ఏమన్నారంటేమన గ్రామ భవిష్యత్తు మన పిల్లల చేతుల్లోనే ఉంది. ముఖ్యంగా మన ఆడపిల్లలు ఉన్నత స్థాయికి చేరుకోవాలి. దూరం భారం వల్ల ఒక్క అమ్మాయి కూడా చదువు ఆపకూడదనే ఈ విప్లవాత్మక అడుగు వేస్తున్నాం. గ్రామస్తుల సహకారంతో దాదాయిపల్లిని విద్యా రంగంలో జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం అని సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామస్తుల హర్షంసర్పంచ్ తీసుకున్న ఈ సాహసోపేత నిర్ణయంపై గ్రామస్తులు , తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల విద్యార్థినుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, ఇది ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# శ్రీరాముడి రథోత్సవం

**.. బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వివాదం**

**టీ మీడియా, ఏప్రిల్ 3,మెదక్ :**జిల్లా తూప్రాన్లో ఉద్రిక్తతల మధ్య శ్రీరాముడి రథోత్సవం ప్రారంభమైంది. రథోత్సవం సందర్భంగా ఘర్షణలు తలెత్తకుండా భారీగా పోలీసులు మోహరించారు. రథంపై కూర్చొనే విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వివాదం చేలరేగింది. మున్సిపల్ ఛైర్మన్ రవీందర్ గౌడ్ రథంపై కూర్చొవద్దని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసింది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు రంగంలోకి దిగారు. ఘర్షణలు తలెత్తనివ్వనని రవీందర్ చేత పోలీసులు హామీ పత్రం రాయించుకున్నారు.

# పాత పేరు, కొత్త ఎజెండాతో ప్రజల ముందుకు

- **కల్వకుంట్ల కవిత**



**టీ మీడియా, ఏప్రిల్ 3, హైదరాబాద్ బ్యూరో:** రాజకీయ పార్టీ కోసం ఏర్పాట్లు వేగవంతం చేస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పాత పేరు, కొత్త ఎజెండాతో ప్రజల ముందుకు వస్తామని అన్నారు. మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్ర సమితి పేరు ఫ్రీ అయిందని ప్రస్తుతం ఎవరైనా వాడుకోవచ్చని తెలిపారు. ఆడబిడ్డకు ఓటు వేయాలన్న అంశం కంటే మించిన ఎమోషన్ ఏముంటుందని అడిగారు. తమ పార్టీ ఆచార్య జయశంకర్ సిద్ధాంతాల ప్రకారమే నడుస్తుందని, తమ పార్టీకి బీహార్ సిద్ధాంతకర్త ఎవరూ లేరని తెలిపారు. తమ ప్రధాన పోరాటం కాంగ్రెస్?పైనే అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రస్తుతం నిద్రావస్థలో ఉందని ఎద్దేవా చేశారు. పునర్విభజన అయినా, కాకపోయినా, తమ పార్టీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉంటుందని, సిద్దిపేట స్థానం మహిళలకు రిజర్వు కాదా? ప్రశ్నించారు.

**రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు విడ్డూరంగా ఉన్నాయి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో హైదరాబాద్?ను ఆగం చేసేలా ఉన్నారని కవిత విమర్శించారు. ఆంధ్రప్రదేశ్, అమరావతి గురించి తమకు అవసరం లేదని స్పష్టం చేశారు. మద్యం కేసు కొట్టి వేశారంటేనే ప్రకృతి తమకు సహకరిస్తుందని అన్నారు. అదృష్టవంతులను ఎవరూ ఆపలేరని, తమ ఎజెండా ప్రకటించాక చాలా మంది పార్టీలోకి వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది విదేశాల్లో ఉన్నవారని, ఇతరులు పార్టీలో చేరుతామని అంటున్నారని పేర్కొన్నారు. పార్టీ తరపున క్షేత్రస్థాయిలో పోరాటం చేస్తామని, శ్రమనే నమ్ముకుని ప్రజల్లోకి వెళ్తామని ప్రకటించారు. ఆరు గ్యారంటీల గురించి కేరళంలో రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు విడ్డూరంగా ఉన్నాయని విమర్శించారు. మహారాష్ట్ర, బీహార్?లో కూడా ఇలాగే చెప్పారని, కాంగ్రెస్?ను ప్రజలు ఓడించారని గుర్తు చేశారు.

**ఉపాధ్యాయులకు జీతాలు పెంచడం లేదు**

చాలా ప్రైవేట్ పాఠశాలలు 25 నుంచి 30 శాతం వరకు ఫీజులు పెంచాయన్న కవిత వివిధ రూపాల్లో అదనంగా భారం వేస్తున్నాయని, ప్రతి నెలా కట్టాల్సిన ఫీజును 60 శాతం ముందే కట్టించుకుంటున్నారని ఆరోపించారు. ఈ అంశాలపై రేవంత్ రెడ్డి గతంలో పదేపదే బీఆర్ఎస్?ను విమర్శించేవారని, అసెంబ్లీ సమావేశాల్లో ఎంత తిన్నారని పరస్పరం తిట్టుకోవడం తప్ప చేసిందేమీ లేదని విమర్శించారు. విద్యా కమిషన్ నివేదిక దరిద్రంగా ఉందని, తక్షణమే ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు పెట్టాలని, ఫీజు నియంత్రణ కమిటీ వేయాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలలు ఫీజు 7,8 శాతం పెంచుకోవచ్చని, కానీ, 30, 40 శాతం కాదని తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు ఫీజులు పెంచుతున్నాయి కానీ, ఉపాధ్యాయులకు జీతాలు పెంచడం లేదని గుర్తు చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పీఎఫ్ కూడా ఇవ్వడం లేదు, అవసరమైతే పీఎఫ్ సంస్థకు ఫిర్యాదు చేస్తామని అన్నారు. పది వేల మంది విద్యార్థులకు ఒకే చోట వంట చేస్తున్నారని, ఏమైనా ఐతే బాధ్యులు ఎవరు? అడిగారు.

**నార్త్ ఇండియన్స్‌కే ఉద్యోగాలు ఇస్తున్నారు**

ఏర్పాటు చేసిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీమ్ ఆ ఆహారాన్ని పరీక్షించాలని సీపీ సజ్జనార్?ను కోరుతున్నామని తెలిపారు. సీఎం ప్రైవేట్ ఆసుపత్రులు, పాఠశాలలను ప్రారంభిస్తున్నారని, దోచుకోవాలని అనుమతి ఇస్తున్నారా? ప్రశ్నించారు. నార్త్ ఇండియన్ విద్యా సంస్థలు ఎక్కువగా వస్తున్నాయని, నార్త్ ఇండియన్స్?కే ఉద్యోగాలు ఇస్తున్నారని, తెలంగాణ వారు ఏం కావాలని, తెలంగాణ వారికి ఉద్యోగాలు ఇవ్వకపోతే వారికి అనుమతులు ఎందుకు ఇస్తున్నారని నిలదీశారు. ఈ ఏడాది అన్ని నార్త్ ఇండియన్స్?కే అనుమతులు ఇచ్చారని, కానీ తెలంగాణ వారికి ఒక్క అనుమతి కూడా ఇవ్వలేదని, విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్?మెంట్ బకాయిలు ఇవ్వకుండా కళాశాలల యాజమాన్యాలు ఇబ్బంది పెడుతున్నాయని ఆరోపించారు. నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై ప్రభుత్వం తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజుల విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే జాగృతి వెళ్లి పాఠశాలల వద్ద ఆందోళన చేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ తరహాలో కాంగ్రెస్ చేస్తే బీఆర్ఎస్?కు పట్టిన గతి కాంగ్రెస్?కు పడుతుందని హెచ్చరించారు. విద్యా శాఖ ముఖ్యమంత్రి వద్దే ఉందని, ఈ విషయాన్ని కూడా పట్టించుకోవడం లేదని, గురుకులాల్లో విద్యార్థులు చనిపోతున్నా సీఎం స్పందించడం లేదని అన్నారు. ఎన్నికల ముందు విద్యార్థులు, విద్యా సంస్థల గురించి మాట్లాడిన రేవంత్ రెడ్డి ఇపుడు అన్నీ మరచిపోయారని తెలిపారు. పదేళ్లలో నిజామాబాద్ జిల్లాకు నారాయణ, చైతన్య లాంటి వాటిని రానివ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వేరే పేర్లతో వస్తున్నాయని, ఏ విద్యాసంస్థ అయినా స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.




## గ్రామ వ్యవస్థను భ్రష్టు పట్టించిందే బిఆర్ఎస్ పార్టీ

- **కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధులు కో**

**టీ మీడియా, ఏప్రిల్ 3, వనపర్తి బ్యూరో :** గ్రామ స్వరాజ్యం, గ్రామ వ్యవస్థ బలోపేతానికి కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ. బిఆర్ఎస్ నాయకులు అవగాహన రహితంగా మాట్లాడడం వారి అవివేకం, గ్రామపంచాయతీకి 20లక్షల నిధులు కేటాయిస్తామని సాక్షాత్తు మీ ముఖ్యమంత్రి ప్రకటించి క్షేత్రస్థాయిలో బిల్లులు రాక సర్పంచులు భార్య పుస్తెలు అమ్ముకున్న దాఖలాలు మనం పత్రికల్లో చూశాం.గ్రామపంచాయతీలను ఏదో ఉద్ధరించామని చెప్పడం చాలా విడ్డూరంగా ఉంది.దశాబ్ద కాలంగా దేశాన్ని పరిపాలించిన కాంగ్రెస్ పార్టీనీ విమర్శించడం అందత్వంరైతులను రాజుగా చేసింది దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కదా,బిఆర్ఎస్ పార్టీ హయాంలో యువతను క్రీడలకు, విద్యార్థులను చదువుకు దూరం నీచమైన ఘనత బిఆర్ఎస్ పార్టీదే కదా,కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామపంచాయతీకి నిధులు ఇచ్చింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు.ప్రజాస్వామ్యంలో ప్రజలకు సంక్షేమంలో కానీ, అభివృద్ధిలో కానీ, ప్రజాస్వామ్యబద్ధంగా అర్హులైన వారందరికీ రావలసిన అంశాలపై ప్రతిపక్షాలు ఉండాలి గానీ, మంచి చేసే పనులకు పక్కన పెట్టి చెడును వెతికి సామాజిక మాధ్యమాలలో చెడు సంకేతలను ఇస్తూ ప్రజలకు మభ్యపెట్టి ధోరణి అవలంబిస్తుండడం వల్లే ప్రతి ఎన్నికల్లో ఓటమిని చొరగుంటూ పాతాళంలోకి వెళ్తుందని తీవ్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, గంధం శరవంద, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్ సాగర్, జిల్లా కార్యదర్శి బి కృష్ణ లు ఘాటుగా మండిపడ్డారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలోనే ఘనమైన చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీని మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ నాయకులకు లేదని ఘాటుగా సూచించారు. సమైక్య రాష్ట్రంలో రైతును రాజుగా చేయడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుంది అనడానికి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి రైతులకు ఉచిత కరెంటు ఇవ్వడం కోసం మొదటి సంతకం చేసింది బిఆర్ఎస్ నాయకులు మర్చిపోయారని ఎద్దేవా చేశారు. దళిత బంధు, బీసీ బందు, మత్స్యకారులకు చేపల పంపిణీ, యాదవులకు గొర్రెల స్కీము వంటివి పథకాలన్నీ ప్రవేశపెడతామని అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది గుర్తు చేశారు. చేసింది గోరంతా, చెప్పుకునేది కొండంత అన్న చందంగా ఉంది బిఆర్ఎస్ నాయకులు చేస్తున్న వైఖరి అంటూ మండిపడ్డారు.

## బైక్‌పై ట్రిపుల్ రైడింగ్

- **ముగ్గురు దుర్మరణం**



**టీ మీడియా, ఏప్రిల్ 3,అమరావతి:** ఏపీలోని అనకాపల్లి జిల్లాలోట్రిపుల్ రైడింగ్ ముగ్గురి ప్రాణాలనూ బలిగొంది. ఈ ఘోర ప్రమాదం గురువారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం, యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం కూడలి సమీపంలో ముగ్గురు యువకులు ప్రయాణిస్తున్న బైక్ అతివేగంగా రోడ్డు దాటుతోంది. ఆ సమయంలో దూసుకొచ్చిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.మృతులు పురుషోత్తపురం గ్రామానికి చెందిన బంగారు నాని (24), ఏటికొప్పాకకు చెందిన ఇల్లకు గోవిందు (25), పోతిరెడ్డిపాలెంకు చెందిన బంగారు దుర్గాప్రసాద్ (16)గా గుర్తించారు. నాని, గోవిందు పెయింటర్లుగా పనిచేస్తుండగా, దుర్గాప్రసాద్ విద్యార్థి. రాత్రి 10:00 గంటల ప్రాంతంలో పురుషోత్తపురంలో అమ్మవారి జాతరకు హాజరయ్యేందుకు ముగ్గురు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పోతిరెడ్డిపాళెం వద్ద దుర్గాప్రసాద్‌ను దింపుతుండగా జంక్షన్ సమీపంలో వీరి బైక్‌ను విజయవాడ వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. ముగ్గురు చనిపోవడంతో స్థానికులు బస్సు అద్దాలు పగులగొట్టారు. గమ్యస్థానాలకు వెళ్లేందుకు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు రాత్రంతా ఇబ్బందులు పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.





## కొండాపూర్‌లో డ్రగ్స్ కలకలం.

- **పబ్‌లో సినీనటి హేమ**

**టీ మీడియా, ఏప్రిల్ 3,హైదరాబాద్:** కొండాపూర్‌లోని గురువారం రాత్రి ఎరీనా పబ్‌పై ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడి చేయగా, ఎనిమిది మంది డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. ఆ పబ్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పార్టీ కోసం నైజీరియాకు చెందిన ఒక డీజేని రప్పించారు. ఈ కార్యక్రమానికి నైజీరియా వ్యక్తి డీజేగా వ్యవహరిస్తున్నారన్న సమాచారం మేరకు, ఈగల్ సిబ్బంది ఆ పబ్‌పై దాడి చేశారు.ఆ ప్రాంగణాన్ని పరిశీలించిన అనంతరం, వారు 64 మందిపై పరీక్ష నిర్వహించారు. వీరిలో ఎనిమిది మందికి పాజిటివ్ తేలింది. పోలీసులు ఆ ఎనిమిది మంది నుండి రక్త నమూనాలను సేకరించి, విశ్లేషణ నిమిత్తం పంపారు. తగిన చర్యలు చేపట్టేందుకు పోలీసులు నివేదికల కోసం వేచి చూస్తున్నారు. పబ్‌లో జరిగిన పార్టీలో తాను ఉన్నానని తనకు డ్రగ్స్ టెస్టులో నెగెటివ్ వచ్చిందని సినీ నటి హేమ ఎక్స్ లో వీడియో పోస్ట్ చేశారు. మత్తుమందులను సరఫరా చేసిన వారిని గుర్తించేందుకు, పోలీసు అధికారులు వినియోగదారుల నుండి మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. మత్తుమందు సరఫరాదారులను గుర్తించే నిమిత్తం, పబ్‌లో అమర్చిన నిఘా కెమెరాల దృశ్యాలను కూడా వారు పరిశీలిస్తున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం

- **ప్రారంభోత్సవంలో దుద్దిళ్ల శ్రీనుబాబు**



**టీ మీడియా, ఏప్రిల్ 3,మంథని:** మంథని నియోజక వర్గ ప్రాంత ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యమని, 40 ఏండ్లుగా మా కుటుంబానికి మీరు సేవే చేసే అవకాశం కల్పించడం మా అదృష్టమని ముత్తారంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు స్మారకర్థం ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ కు చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ముత్తారం జూనియర్ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, పెద్దపల్లి డిసిపి రాంరెడ్డి తో కలిసి శ్రీనుబాబు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ తండ్రి శ్రీపాదరావు ఆశయాలను కొనసాగించేందుకు మంథని ప్రాంత ప్రజలకు నిత్యం సేవ చేయడమే తమ కుటుంబ బాధ్యత అని, బాధలో ఉన్నవారు తమకు ఫోన్ చేస్తే మేము బాధ్యతగా వారికి సేవలు అందించడం మా బాధ్యత అని శ్రీనుబాబు తెలిపారు. పెద్దపల్లి డిసిపి, గోదావరిఖని ఏసిపి, ముత్తారం మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు చొప్పరి సదానందం, బాలాజీ, జగన్ మోహన్ రావు మండల నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు ఎంతో కృషి చేశారని కొనియాడారు. వారి సహకారంతోనే పేద ప్రజలకు సేవ చేస్తున్నామన్నారు. ఈ వైద్య శిబిరంలో అవసరం ఉన్నవారికి ఆపరేషన్ చేయబడునని, నాణ్యమైన కండ్ల అద్దాలు కూడా ఉచితంగా అందిస్తామన్నారు. ఈ ఉచిత క్యాంపు శనివారం కూడా కొనసాగుతుందని మండలంలోని ప్రతి ఒక్కరు ఈ కంటి వైద్య శిబిరంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ శ్రీపాద రావు స్మారకర్థం గ్రామీణ ప్రాంతాల్లోని బీదవారికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్న పుష్పగిరి వైద్య బృందానికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అభినందనలు తెలిపారు. ముత్తారంలో ఉచిత వైద్య కంటి శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమని మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ శిబిరానికి మొదటి రోజు భారీ స్పందన వచ్చింది దాదాపు 1000 మందికి పైగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## విష మామిడి పళ్ళ తయారీ..

- **పైన నిగనిగ లోపల కాలకూట విషం.**






**టీ మీడియా, ఏప్రిల్ 3, ప్రత్యేక ప్రతినిధి:**వేసవి కాలం వచ్చేసింది. మామిడి పండ్ల సీజన్ మొదలైంది. రుచికరమైన, తీపి మామిడి పండ్లు అందరికీ ఇష్టం. కానీ హైదరాబాద్ మార్కెట్లలో కొందరు స్వార్థపరులైన వ్యాపారులు కాల్షియం కార్బైడ్ వంటి నిషేధిత రసాయనాలను ఉపయోగించి మామిడి కాయలను కృత్రిమంగా పండిస్తున్నారు. ఇలాంటి పండ్లు బయట నుంచి నిగనిగలాడుతూ, ఆకర్షణీయంగా కనిపించినా, లోపల పచ్చిగా ఉండి ఆరోగ్యానికి తీవ్ర హాని చేస్తాయి. ఎన్ని రోజులంటే.. హైదరాబాద్‌లోని ఆసిఫ్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఫరీద్ ఫ్రూట్ షాప్ గోదాం పై హెచ్ ఫాస్ట్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. మామిడిపండ్లను “ఇథలీన్” అనే రసాయనంతో కృత్రిమంగా మక్కపెడుతున్నారనే సమాచారంతో ఈ రైడ్ చేపట్టినట్లు హెచ్ ఫాస్ట్ సీఐ రంజిత్ తెలిపారు. దాడుల్లో మొత్తం సుమారు 7 టన్నుల మామిడిపండ్లు గుర్తించారు. ఈ పండ్లను బాటాసింగారం మార్కెట్ నుండి కొనుగోలు చేసి, గోదాంలో నిల్వ ఉంచి మార్కెట్‌కు సరఫరా చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.ఈ వ్యవహారంలో గోదాం నిర్వాహకులు జమీల్, ఫరీద్‌పై కేసు నమోదు చేసి, గోదామును సీజ్ చేశారు. దాడుల సమయంలో సుమారు 350 ట్రేలను పోలీసులు గుర్తించారు. ఒక్కో ట్రేలో దాదాపు 20 కిలోల పండ్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. హైదరాబాద్ పాతబస్తీలోని మొగల్ పుర, లాల్ దర్వాజా ప్రాంతాలలో చార్మినార్ టాస్క్ ఫోర్స్ జోన్ పోలీసుల దాడులు నిర్వహించారు. ప్రమాదకరమైన కెమికల్స్ తో మామిడి పండ్లను మగ్గ పెడుతున్న గోదాములపై దాడులు చేసి టన్నులకొద్ది మామిడిపండ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.మామిడి కాయలను కేవలం 5 రోజుల్లోనే పండ్లు గా మారుస్తున్న నిర్వాహకులు.. ఇథనాల్ ను 10 కిలోల మామిడి కాయలు ఉండే ట్రే లో కేవలం 2 ఇథనాల్ ప్యాకెట్స్ ఉంచాలి. అది కూడా కాంటాక్ట్ లెస్ గా.. కానీ.. ఒక్కో ట్రే లో 7, 8 ఇథనాల్ ప్యాకెట్లు.. అది కూడా నేరుగా ఉంచుతున్నారు. ప్యాకెట్ నుంచి వెలువడే హానికర గ్యాస్ ద్వారా కేవలం మూడు రోజుల్లోనే కాయ పూర్తిగా మగ్గుతోంది. ఈ మామిడి పండ్లు తినడం ఆరోగ్యానికి హానికరం.. పిల్లలకు ప్రాణాంతకంగా మారుతోంది.ూశ్రీంశీ =ఝు:=వ్ష్టబ దీష్ట్ఞుతీశీయ: తెలంగాణ రైతులకు శుభవార్త.. రెండో విడత నిధుల విడుదలకు ముహూర్తం ఫిక్స్..కల్తీ మామిడిని ఎలా గుర్తించాలిరంగు: సహజంగా పండిన పండు అంతటా ఒకే రంగులో ఉండదు. ఆకుపచ్చ ం పసుపు మిశ్రమం ఉంటుంది. కల్తీ పండు పైన ఏకరీతి పసుపు-పచ్చగా, లోపల పచ్చిగా ఉంటుంది.వాసన: సహజ పండుకు తీపి, సువాసన ఉంటుంది. కల్తీ పండుకు వాసన తక్కువ లేదా రసాయన వాసన వస్తుంది.నీటి పరీక్ష: ఒక బకెట్ నీటిలో వేయండి. సహజ పండు బరువుగా మునుగుతుంది. కల్తీ పండు తేలికగా తేలుతుంది.ముట్టుకోవడం: కల్తీ పండ్లు త్వరగా మెత్తబడతాయి లేదా బ్లాక్ స్పాట్స్ వస్తాయి. చర్మం మీద బర్న్ లాంటి మచ్చలు కనిపించవచ్చు.రుచి: లోపల తీపి తక్కువగా, పచ్చి రుచి ఉంటుంది.

జర్నలిజం ఉచిత శిక్షణ
టీ మీడియా (తెలుగు మీడియా) డిజిటల్ ఆధ్వర్యంలో
జర్నలిజం వృత్తి శిక్షణ తరగతులు
వారం (07) రోజులు పాటు రోజుకు గంట
ఖమ్మంలో నిర్వహించబడును.
కనీస విద్యార్హత ఇంటర్ :
ఆసక్తి ఉన్నవారు తమ బయోడేటా
8919710365 కి వాట్సాప్ చేయగలరు.
నోట్ ఎటువంటి ఫోన్ చేయవద్దు,
శిక్షణ స్థలం, తేదీ తరువాత తెలియజేస్తాము.
ఇట్లు
టీ మీడియా కుటుంబం

డిజిటల్ మీడియా మిత్రులకు ఆహ్వానం
కేంద్ర ప్రభుత్వం రూపొందించిన
డిజిటల్ మీడియా ఇతిక్స్ కోడ్ 2021
అమలు కోసం, మన ఆత్మ గౌరవం కోసం,
జర్నలిస్టులుగా గుర్తింపు కోసం,
ఖమ్మం గడ్డ నుండి ఉద్యమానికి కార్యాచరణ చేద్దాం
సమిష్టిగా చర్చించి
కార్యక్రమం రూపొందిద్దాం
ఇట్లు
టీ-మీడియా కుటుంబం
తెలుగు డిజిటల్
సెల్ : 8919710365



## దొంగనోట్ల ముఠా గుట్టురట్టు

- **ముగ్గురు నిందితుల అరెస్ట్**

**టీ మీడియా, ఏప్రిల్ 3,లక్షెట్టిపేట:** లక్షెట్టిపేటలో కలకలం సృష్టించిన నకిలీ నోట్ల చలామణి కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. పరారీలో ఉన్న మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం రాత్రి మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిర్యాల ఏసీపీ ప్రకాష్ వివరాలను వెల్లడించారు. నకిలీ నోట్ల చలామణి కేసులో గతంలో 12 మందిని అరెస్ట్ చేయగా, అప్పటి నుంచి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు నిందితులను పోలీసులు పక్కా సమాచారంతో పట్టుకున్నారన్నారు. పరారీలో ఉన్న కోదండరావు (కాకినాడ), రవి (పశ్చిమ గోదావరి జిల్లా), శ్రీనివాస్ (గోదావరిఖని) లను ఇటిక్యాల సమీపంలో సిఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ బృందం చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారన్నారు.నిందితుల వద్ద నుంచి 61,000 రూపాయల విలువ గల 500 నకిలీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నామని, వీటితో పాటు నేరానికి ఉపయోగించిన నాలుగు సెల్ ఫోన్లను కూడా జప్తు చేశామన్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించనునట్లు ఏసీపీ పేర్కొన్నారు. ఈ విలేకరుల సమావేశంలో లక్షెట్టిపేట సిఐ రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



### సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో....

## ఏసీబీ సోదాలు

- **రూ.42 లక్షల ఫోన్‌పే లావాదేవీలు**

**టీ మీడియా, ఏప్రిల్ 3, వరంగల్ :**లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అక్రమాలకు అడ్డాగా మారింది. డబ్బులిస్తేనే రిజిస్ట్రేషన్ చేసిన పత్రాలు, దస్తావేజులు ఇస్తారు. లేదంటే తమ వద్దే పెట్టుకుని ముప్పుతిప్పలు పెడతారు. ఈ ప్రక్రియలో ప్రైవేటు వ్యక్తులతో కలిసి అధికారులు లంచాలకు అలవాటు పడ్డారు. దీంతో విసిగిపోయిన వారు కొంతమంది ఏసీబీని ఆశ్రయించారు.

**లెక్కల్లో చూపని భారీ నగదు స్వాధీనం**

వరంగల్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం సహా సబ్ రిజిస్ట్రార్ నివాసాల్లో జరిగిన ఏసీబీ తనిఖీల్లో భారీగా అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన అవినీతి నిరోధక శాఖ అధికారులు లెక్కల్లో చూపని భారీ నగదును స్వాధీనం చేసుకున్నారు. సబ్? రిజిస్ట్రార్? ఆఫీసర్ల ఇళ్లలో భారీ మొత్తంలో బంగారు, వెండి ఆభరణాలను గుర్తించారు. అవినీతి ఆరోపణలపై గురువారం వరంగల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టిన అధికారులు 20 మంది అనధికార ఏజెంట్లు, డాక్యుమెంట్ రైటర్లు ఉన్నట్లు గుర్తించారు.

**కపిల్ చిట్స్?లో రూ.30 లక్షల డిపాజిట్లు**

వారి నుంచి రూ.47,450 నగదు, 70 దస్తావేజులను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల సమయంలో డాక్యుమెంట్ రైటర్ల సెల్‌ఫోన్లను పరిశీలించిన ఏసీబీ అధికారులు ఏడాదిలో ఏకంగా రూ.42 లక్షల ఫోన్‌పే లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. 204 డెలివరీ కాని డాక్యుమెంట్లు ఎస్ఆర్‌వోల వద్ద ఉన్నట్లు వెల్లడించారు.

**820 గ్రాముల బంగారం**

సబ్? రిజిస్ట్రార్? అధికారులు రామనర్సింహారావు, ఆనంద్ మధ్య వాట్సాప్ చాటింగ్‌ను పరిశీలించి వారి నివాసాల్లో తనిఖీలు చేపట్టారు. రూ.24.61 లక్షల నగదు, 820 గ్రాముల బంగారం, 2.6 కిలోల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. సబ్? రిజిస్ట్రార్ అధికారి ఆనంద్‌కు కపిల్‌చిట్స్‌లో రూ.30 లక్షల విలువైన ఫిక్స్డ్ డిపాజిట్లు ఉన్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. అధికారులు చేసిన మొత్తం అక్రమాలపై పూర్తి నివేదికను సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించేందుకు ఏసీబీ అధికారులు సిద్ధమయ్యారు.